
చిట్టికథల పోటీలో రూ. 150 బహుమతి పొందిన కథ




# ఇది కథ కాదు

_ఎమ్.ఎల్. సత్యమణి

డియర్ శ్రీ బాలా!

నిన్నేమని దీవించాలో అర్థంకావటంలేదే! నీ కంటే, అరునేలలు పెద్దదాన్నిగా, నిన్ను దీవిస్తూనే వుత్తరం ప్రారంభిస్తాను. ముఖ్యంగా నీకిప్పుడు కావలసినది ధైర్యం. అది లేకనే నీవిట్లా తయారయ్యావు కనుక ధైర్యలక్ష్మి నీకు అండగా వుండాలని ఆశిస్తున్నాను.

అసలు నువ్వింత బేలగా, ఏమీచేతగాని పిరికిదానిలా ఆత్మహత్యకు పాల్పడడమెందుకో నాకు ఎంత ఆలోచించినా అర్థంకావటంలేదు. యూనివర్సిటీ గోల్డు మెడలిస్టువి. ఎమ్.ఎ. ఎకానామిక్స్ గోల్డు మెడలిస్టంటే, మాటలు కాదు. నీ విద్యకు ప్రపంచంలో ఏ మూలకి వెళ్ళినా గుర్తింపు వున్నది. మీ ఆయన నిన్నుకాదని, మరొక అమెరికన్ అమ్మాయిని పెళ్ళాడినంత 'మాత్రాన, నువ్వు చావుకు సిద్ధపడటం ఏమిటి? నువ్వుపోతే మీ అయనకేం బాధ? నీ బిడ్డకి తల్లి, తండ్రి, నీ తలిదండ్రులకి బిడ్డ కరువవుతారే తప్ప, మరేం ప్రయోజనంలేదు. అన్ని విషయాల్లో ముందంజ వేసి మగపిల్లలతో సమానంగా, సైకిల్, స్కూటర్, కారు డ్రైవింగ్ నేర్చుకుని, ఆపైన కరాటే కూడా నేర్చుకుని, మనవాళ్ళందరిలోకి తలమానికంగా, ఆడపిల్లంటే నీలాగా మంచిధైర్యంగా, వుత్సాహంగా వుండాలని, వుదాహరణగా చెప్పబడే నువ్వు అత్మహత్యకు సిద్ధపడ్డావంటే, నమ్మశక్యం కాలేదు. కానీ, మీ అమ్మ నీ వుత్తరం చూపబట్టి నమ్మాను.

ఇంక నా విషయానికి వస్తే, నువ్వు మరింత ఆశ్చర్యపోతావు. 'వెన్నపెడితే, మింగలేవు. వేలు పెడితే, కొరకలేవు'. ఈ ప్రపంచంలో ఎట్లా బ్రతుకుతావే? అని నువ్వు ఎన్నోసార్లు నా మీద జాలిపడ్డావు గుర్తున్నదా! ఒకసారి గుడివాడ నుంచి మా వూరుకి కాలవ మీద లాంచీలో వెళ్ళి మా వూరి బయటదిగి, అక్కడినించి, నన్ను తీసుకుని వెళ్ళటానికెవరూ తోడు రాలేదని, మళ్ళీ లాంచీ ఎక్కి గుడివాడ తిరిగి వచ్చేశానని, మీరంతా నన్ను వుట్టి పిరికిపంద అని వేళాకోళం చేశారు. జ్ఞాపకం వచ్చిందా!

అలాంటి నాకు, మద్రాసులో వుద్యోగం చేస్తున్న అందమైన వరుడిని తెచ్చి పెళ్ళి చేశారు. మీరంతా మా పెళ్ళిలో చక్కని జంట అని మమ్మల్ని ఎంతో అభినందించారు. నేను చాలా చాలా సంతోషించాను. బాదరబందీలేని సంసారం. మహాపట్నంలో కాపురం అనుకున్నా. నిజానికొక మూడు నెలలు మా సంసారం, గాలిలో తేలిపోతున్నంత సంబరంగా గడిచింది. సినిమాలేనా, షికార్లేనా, హొటల్లో భోజనాలేనా, ఒహ్! రోజులు నిముషాల్లాగా గడిచిపోయాయి.

అంత సంతోషంలోనూ మొట్టమొదటి అపశ్రుతి ఎప్పుడు వచ్చిందంటే, ఒకరోజు మేమిద్దరం మౌంట్‌రోడ్‌లో నడుస్తున్నాము. అక్కడున్న పురాతనమైన బిల్డింగ్‌ని చూపించి, "ఆ, భవనం ఎవరిదండీ!" అని మా ఆయన్ని అడిగాను నేను. "అది స్పెన్సర్ బిల్డింగంటారులే!" అన్నారాయన. "అదా! చుట్టల కంపెనీ కింత పెద్ద

## వనిత మాటల కొలువు - 201 ఫలితాలు

సరైన సమాధానాలు :

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 స | త్య | 2 ము | ■ | 3 ప్రే | ■ | 4 క్ర | ళ్లి |
| ణు | ■ | క్త | ■ | 5 మ | గు | వ | ■ |
| 6 గు | న | ప | ము | ■ | ■ | యి | ■ |
| డు | ■ | ద | ■ | ■ | 7 ప | త్రి | 8 క |
| ■ | ■ | 9 గ్ర | 10 హా | ము | లు | ■ | మ్మ |
| ■ | 11 వి | స్త | రి | ■ | 12 కు | 13 ము | లు |
| 14 మే | ■ | 16 ము | త | క | ■ | చ్చ | ■ |
| 16 త | ల | ■ | ము | ■ | 17 అ | ట | వి |

ఈ సమాధానంతో సరిపోయే సమాధానం రాసినవారు 20 మంది వుండడంచేత వారిలో ఐదుగురిని లాటరీ విధానంలో బహుమతికి అర్హులుగా ఎన్నుకోవలసి వచ్చింది వారు :

1. పి.వి. రత్నమాల, అమలాపురం., 2. కె. శకుంతలాదేవి, కోదాడ., 3. ఎ. లక్ష్మి విశాఖపట్నం., 4. ఖాజా సురయ సుల్తాన్, చెన్నూరు., 5. కె. మంజురమణ, ఏలూరు.

**బహుమతి మొత్తం రూ. 250/- వీరికి సమానంగా పంచి అందజేస్తున్నాము.**

వీరుకాక సరైన సమాధానం రాసిన తక్కిన వారు :

1. జె. కుసుమకుమారి, అత్రేయపురం, 2. జి. జయకుమారి, అలూరు, 3. టి. రత్నకుమారి, నందివెలుగు, 4. కె. పద్మ కొత్తగూడెం, 5. కె.వి. లక్ష్మి హైద్రాబాదు., 6. పద్మ అద్దంకి, హైద్రాబాద్., 7. ఎ. మీనాక్షి, హైద్రాబాదు, 8. పి. అన్నపూర్ణ, విజయవాడ, 9. టి. విజయలక్ష్మి పోరంకి, 10. ఎస్. భానుమతి, తిరుపతి, 11. వి. రాధ, దోమకొండ, 12. టి. జ్ఞానప్రసూన, ఏలూరు, 13. అర్. జయలక్ష్మి హైద్రాబాద్, 14. ఆర్. కనకదుర్గ, ఇచ్ఛాపురం, 15. వై. విజయలక్ష్మి తిరుపతి.

బంగళాఖా?" అన్నానేను. నేనన్నదేమిటో ఆయనకర్థంకాలేదు. "అదేనండీ! పత్రికల్లో ప్రకటన రాదూ స్పెన్సర్స్ వారి ఘంట చుట్టలనే వాడండీ!" అని నేను వివరించే సరికాయన పగలబడి నవ్వారు.

ఇంక రెండో సంఘటన. మెరీనా బీచ్‌లో కూర్చున్నాము. దూరంగా కనబడుతున్న ఓడలని చూపుతూ, హార్బర్ గురించి చెప్పారు. "ఏమండీ మనం ఒకరోజు, ఆ బార్బర్‌కి వెడదామండీ!" అన్నాను. హార్బర్‌వైపు చేయి చూపుతూ, మా దగ్గరలోనే కూర్చున్న ఇద్దరు యువకులు, నా మాటలకి ఫక్కున నవ్వారు. దాంతో మా ఆయనకి బాగా కోపంవచ్చి, "చదువు, సంధ్యాలేని మొద్దుని, సంప్రదాయ కుటుంబం' అని నా తలకికట్టారు" అంటూ నన్ను, వాళ్ళమ్మా నాన్నలని తిట్టారు.

ఇహ ముచ్చటగా మూడోదేమిటంటే, మా ఇంటి ప్రక్కనే ఒక తెలుగు కుటుంబం వున్నది. వాళ్ళమ్మాయికి, కొడుకు పుట్టాడు. 'వాడిని వుయ్యాల్లో వేస్తున్నాము. పేరంటానికి రండి!' అని పిలిచారు. నేను వెళ్ళాను. నన్ను కూర్చోమని, చిన్న పేపర్ ప్లేట్‌లో రెండు స్వీట్స్, కారం బూందీ పెట్టి ఇచ్చారు. నాకు అవి తినాలో మానాలో తెలియ లేదు. చుట్టూతా చూస్తే, అంతా మాట్లాడు కుంటున్నారు. మన వూళ్ళల్లో అయితే, పేరంటానికి వెడితే, ముందు బొట్టుపెట్టి, కాలికి పసుపు రాస్తారు. తరువాత పండ్లు సెనగలు వాయనమిస్తారే తప్ప, ఇలా కూర్చోపెట్టి, ఫలహారాలిస్తారా? నువ్వే చెప్పు! ఈ మహాపట్నంలో పద్ధతింతేకాబోలు; అని నేను, వాటిని నా చేతి రుమాల్లో పోసుకుని మూటగట్టుకుని ఇంటికి వచ్చేశాను. అ మర్నాడు, మా ఇంటావిడ నన్ను అడిగింది. "అదేమిటమ్మా తాంబూలం తీసుకో కుండా వచ్చేశావుట. ఆవిడ నీకిమ్మనమని ఇచ్చింది. ఇదుగో" అంటూ పండు తాంబూలం కొబ్బరికాయ, పసుపు కొమ్ములు పెట్టిన కవరు, మా అయన ముందే నాకిచ్చింది. జరిగిన విషయం తెలుసుకున్న ఆయన వేసిన చిందు లిప్పటికీ నాకు బాగా గుర్తున్నాయి.

కృష్ణాజిల్లాలో ఓ మారు మూలగ్రామంలో పుట్టి పెరిగిన నేను, తెలుగు తప్ప ఇంగ్లీష్ అక్షరం రాని దాన్నని తెలుసుండీ, పెళ్ళి చేసుకున్న పెద్ద మనిషి, అప్పుడేం చెయ్యాలి? నన్ను దగ్గర కూర్చోపెట్టుకుని ఇది పట్నం ఇక్కడిట్లా మెలగాలి! అని చెబితే, నేర్చుకోలేనంత మొద్దుని కాదుగదా!

మరి మా అయనేం చేశారూ! నన్ను బయటకి తీసుకుని వెళ్ళటం మానేశారు. క్రమంగా నా పరిస్థితి వంట మనిషి స్థాయిలోకి దిగింది. ఇంతలో పులి మీద పుట్రలాగా, మా ఇంటివారి బంధువు లమ్మాయి, జాకీ రంగ ప్రవేశం చేసింది. పేరు జానకైతే, కుదించి, జాకీ అని పిలుస్తారు. బ్యాంకిలో ఆఫీసర్‌గా పని చేస్తున్నది. మద్రాసు బదలీ అయి వచ్చి వీళ్లింట్లోనే వుం[illegible]ది. చదువు, వుద్యోగంగల అమ్మాయికి, అధునిక వేషధారణ తోడై, తారాజువ్వలా కనబడేది. నా మీద విరక్తి పెంచుకున్న మా ఆయనకి, జాకీతో పరిచయంతో ప్రాణంలేచి వచ్చినట్లయింది. ఇద్దరూ చెట్టా పట్టాలేసుకుని తిరిగేవారు. నేనూ చూస్తూ వుండేదాన్నే తప్ప, ఏమనలేక పోయేదాన్ని. ఒకరోజు, వాళ్ళిద్దరూ గదిలో వుండగా నేనక్కడికి వెళ్ళానని, జాకీకి బాగా కోపం వచ్చింది. రుస రుసలాడుతూ వెళ్లి, మా ఇల్లు గలావిడతో ఏం చెప్పిందో మరి, ఆవిడ వచ్చి, నా చీరలన్నీ నా పెట్టెలో సర్దేసి నా జబ్బపుచ్చుకుని, బర బరాలాక్కువచ్చి, "నువ్వు, మాధవకి తగిన దానివి కాదు మెదలకుండా, మీ వాళ్ళ దగ్గరకి వెళ్ళి పో!" అని బజార్లో పోయే ఆటోని పిల్చి, నన్ను అందులో కూలవేసి, ఆటోవాడితో, నన్ను స్టేషన్లో దించమని చెప్పి డబ్బులు కూడా ఇచ్చేసింది. నేను ఆటోదిగి, పరుగెత్తుకెళ్లి మా అయన కాళ్ళ మీద పడ్డాను. నన్ను పంపవద్దని, బ్రతిమాలుకున్నాను. ఆయన నోరు మెదపలేదు. ఇల్లుగలావిడ నన్ను దాదాపుగా ఎత్తుకొచ్చినట్లు తీసుకువచ్చి, ఆటోలోదించి, ఆటోని పోనిమ్మంది. నా ఏడుపుతో నిమిత్తం లేకుండానే, ఆటో స్టేషన్ ముందాగింది.

అప్పటికి నా ఏడుపు వుధృతం తగ్గింది. పాతిక వేలు కట్నమిచ్చి, అంతకు రెట్టింపు ఖర్చుపెట్టి పెళ్ళి చేసి పంపిన, అమ్మ నాన్నల మీద భారంగా బ్రతికేకంటే, ముక్కు మూసుకుంటే మూడు ఘడియలు పట్టదని, సముద్రంలో పడదామని బీచ్‌కి వచ్చాను. అ రోజు బాగా, గాలీ పెనుతుఫాన్. బంగాళాఖాతం మహా అల్లకల్లోలంగా వుంది. నాకు సముద్రాన్ని చూసే సరికి భయం వేసింది. దూకలేకపోయాను. అసలు నేనెందుకు చావాలి? ఏం తప్పు చేశాననీ! అంతగా బ్రతకలేకపోతే అప్పుడే చూసుకోవచ్చని ఆలోచించి, అక్కడి నుంచే సరాసరి అంధ్ర మహిళా సభకి వెళ్ళాను. అక్కడి దయామయి నన్నాదరించింది. కుట్టు పని నేర్పింది. ప్రయివేట్‌గా మెట్రిక్ కట్టి ప్యాసయ్యాను. అట్లా అట్లా బి.ఎ. బి.యిడి. చేసి, ఒక స్కూల్లో టీచర్‌గా చేస్తూ బ్రతుకుతున్నాను. నా ఆలోచన లను కాగితంమీద పెడుతుంటే, కథలుగా పత్రికల్లో అచ్చువుతున్నాయి. నాటకాలుగా రేడియోలో ప్రసారమవుతున్నాయి. వూరిలో జరిగే సభలకీ సమావేశాలకి పిలుపులు వస్తున్నాయి. ఇక్కడి సమాజం నన్నొక వ్యక్తిగా గుర్తించి గౌరవిస్తోంది.

ఇప్పుడు చెప్పు నువ్వు. పెళ్ళి కాకముందు నేనేమిటో నీకు బాగా తెలుసు కదా! అలాంటి నన్ను పరిస్థితులు చుట్టు ముట్టి వుక్కిరి బిక్కిరి చేసి, నాలోగల, భయం, పిరికితనం, మొహమాటం వగైరా లక్షణాలని వెళ్ళగొట్టి, నన్నొక వ్యక్తిగా నిలబెట్టాయి. నీకు ముందు నుంచే, అన్ని అర్హతలు వున్నాయి. నీ భర్త కాదన్నంత మాత్రాన చావాలనుకోవటం అవివేకం, నిజమే నువ్వు అతడిని ప్రాణంకంటే, మిన్నగా ప్రేమించావు. ఆ భావం అతడికూడా వుండాలి కదా! అతనికి లేదని నువ్వు విరక్తి చెందితే, నీ బిడ్డ గతేమవు తుంది? అది ఆలోచించు. నువ్వు భార్యస్థానం లోంచి తల్లిస్థానంలోకి రా! నువ్వు అక్కడ అమెరికాలో వుండలేకపోతే ఇక్కడికి వచ్చెయ్యి! ఏదోక వుద్యోగం దొరక్కపోదు. అంతవరకు నా దగ్గరే వుందుగానీ! అనవసరమైన ఆలోచనలు పెట్టుకోకు వెంటనే బయల్దేరి రా! నీ రాక కోసం ఎదురుచూస్తూ వుంటాను.

-నీ కరుణ